విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 25, సెప్టెంబరు 2024

మూడు గ్రామాల్లో భారీ వర్షం

పంట పొలాల్లో నిలిచిన నీరు

విశాలాంధ్ర కొలిమిగుండ్ల : మండలంలోని బెలుం, మీర్జాపురం, బెలుంసింగవరం గ్రామాలలో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో ఆ గ్రామాల పరిధిలోని వంకలు వాగులు పొంగి ప్రవహించాయి. కుంటలు వర్షపు నీటితో కళకళలాడుతున్నాయి. వర్షపు నీరు ముంచెత్తడంతో కొన్నిచోట్ల పంట పొలాలు నీట మునిగాయి. బెలుం గుహల ఎదురుగా కుంట నిండి జాతీయ రహదారి పైన నీరు నిలువగా,కొలిమిగుండ్ల సమీపంలో తారు ప్లాంట్ ఎదురుగా కల్వర్టు పూడిపోవడం తో రహదారిపై పంట పొలాల నీరు ప్రవహిస్తుంది. మండలంలోని మిగిలిన గ్రామాలలో మోస్తారు వర్షం కురిసింది.

ముంచిన వర్షం.. రైతు కంట కన్నీరు

- చేతికొచ్చిన మినుము పంట వర్షార్పణం
- నీట మునిగి ఐదెకరాల్లో కుళ్లిపోయిన పంట

నీటిలో ఉండి కుళ్ళిపోయిన మినుము పంట ..

విశాలాంధ్ర కొలిమిగుండ్ల : చేతికొచ్చిన పంటను వరుణ దేవుడు నిండా ముంచాడు. దాదాపు మూడు నెలల పాటు కష్టపడ్డ శ్రమ అంతా వర్షార్పణమైంది. మూడు రోజులుగా వర్షం కురవడంతో కోత కోసిన పంట అంతా తడిసి ముద్దయి నీటిలోనే ఉండి కుళ్లిపోయింది. మండల కేంద్రమైన కొలిమిగుండ్ల సమీపంలో మీర్జాపురం రోడ్డులో గ్రామానికి చెందిన పేరు చిన్న ఈశ్వర్ రెడ్డి బోరుబావి కింద మూడు నెలల కిందట 5 ఎకరాలు పైగా మినుము పంట సాగు చేశాడు.పంట బాగుండడంతో దిగుబడి కూడా ఎకరాకు 5 క్వింటాలకు పైగా రావాల్సింది. ఈనెల 18, 19,20 తేదీలలో మినుము పంటను కూలీలతో కోత కోసి పొలంలోనే ఆరబెట్టాడు. ధాన్యం కోత మిషన్ కోసం వేచి ఉండగా 21వ తేదీ రాత్రి వర్షం రావడంతో పంట పూర్తిగా తడిచిపోయింది. 22 వ తేదీ పంటను ఆరబెట్టగా అదే రోజు రాత్రి, 23వ తేదీ రెండు రోజులు మళ్లీ వర్షం కురవడంతో పంట పొలంలోనే వర్షపు నీరు నిలిచి పంట అంతా పనికిరాకుండా కుళ్లిపోయింది.

దాదాపు 25 క్వింటాళ్ల మినుములు వర్షార్పణం కావడంతో 2 లక్షల రూపాయల వరకు రైతుకు నష్టం వాటిల్లింది.నాగిశెట్టిపల్లి గ్రామంలో రైతు పుల్లయ్య సాగుచేసిన 7 ఎకరాలు మినుము పంట దెబ్బతిన్నట్టు తెలిసింది. మినుము సాగు చేసి నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణ సమస్యలపై 26న మున్సిపల్ కార్యాలయం ముట్టడి

- సీపీఐ నాయకులు

విశాలాంధ్ర నంద్యాల అర్బన్: పట్టణంలోని 42 వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 26న మున్సిపల్ కార్యాలయ ముట్టడికి సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం నంద్యాల సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో వీధి కుక్కలు, పిచ్చి కుక్కలు, దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులుఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు వార్డులలో ఫాగింగ్ చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టడంలేదన్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు వీధి కుక్కల గురించి వినతిపత్రాలు అందజేసినా ధర్నాలు నిర్వహించినా ఎలాంటి చలనం లేదన్నారు. నందమూరి నగర్, వైయస్ నగర్‌తో పాటు అనేక వార్డులలో ఇప్పటికీ సిసి రోడ్లు, డ్రైనేజీలు లేక చిన్నపాటి వర్షానికే వర్షపు నీరు నిలబడి దోమలు వృద్ధి చెంది విష పురుగులతో అక్కడి ప్రజలు సహజీవనం చేస్తున్నారన్నారు. దశాబ్దాలు గడుస్తున్న ఇప్పటికీ అక్కడ ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు చేతులు మారుతూ ఖాళీ స్థలాలుగా దర్శనిమిస్తున్నాయన్నారు. ఇలా అనేక సమస్యలు పట్టణంలో తాండవిస్తున్నాయని, సమస్యలపై సీపీఐ పట్టణ సమితిగా ఈనెల 26వ తేదీన మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జిసోమన్న, ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి సురేష్, సలీం నగర్ సీపీఐ శాఖ సహాయ కార్యదర్శి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అతి త్వరలోనే నెరవేరుస్తా

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ..

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : నియోజకవర్గ ప్రజలకు తాను ఇచ్చిన హామీలన్నీ అతి త్వరలోనే నెరవేరుస్తామని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. దొర్నిపాడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తెలుగుదేశం వస్తేనే మన భవిష్యత్తులు బాగు పడతాయని నమ్మి ఓటేశారు.. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. ఒక్క ఛాన్స్ అని రైతులకు నెరవేర్చలేని అపద్దపు హామీలిచ్చి రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డి అల్లకల్లోలం చేశాడన్నారు. కానీ టీడీపి అధికారంలోకి వచ్చి 100 రోజుల్లో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసేందుకు సీఏం చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు.

జగన్ మోహన్ రెడ్డి వరద బాధితులకు రూ.1 కోటి ప్రకటించారు కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. దొర్నిపాడు మండలంలో రైతులు సాగు నీరు లేక ఎంత ఇబ్బంది పడ్డారో నేను దగ్గరుండి చూసానని, రెండు రోజుల పాటూ కాలువ వెంట తిరిగి ఇదే చోట కలెక్టర్ తో కొట్లాడి మరి నీరు తెప్పించామని ఆనాడు వైకాపా నాయకులు రైతులను హీనంగా చూశారన్నారు. కానీ నేను నేడు అదే రైతులను స్టేజ్ పై నా పక్కన కూర్చోబెట్టుకున్నానన్నారు.

ఆళ్ళగడ్డ నియోజవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు నేను పరిగెత్తుతా.. అధికారులను పరిగెత్తిస్తా అని అన్నారు. ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటామన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న ఉచిత గ్యాస్ సిలిండర్లును ఈ దీపావళికి అందజేస్తామన్నారు. అనంతరం " ఇది మంచి ప్రభుత్వం " స్టిక్కర్లను ఆవిష్కరించి ఇంటింటికి తిరిగి వంద రోజుల్లో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి స్టిక్కర్లను అతికించారు. అనంతరం దొర్నిపాడు మండలం భాగ్యనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే అఖిల ప్రియ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్లాస్ రూమ్ లో ఫ్యాన్లు లేవని, బిల్డింగ్స్ కొన్నిచోట్ల పాడు పడిపోయాయని, స్కూల్ కాంపౌండ్ వాల్ సరిగా లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: రాష్ట్రాన్ని సంక్షేమంతో పాటు అభివృద్ధిలో ముందుకు తీసుకు వెళ్లడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మంగళ వారం ఉయ్యాలవాడలో మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉయ్యాలవాడ గ్రామ సచివాలయానికి మంజూరైన ట్రాక్టర్ను ప్రారంభించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడితే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పెంచిన పింఛన్ మొత్తాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు

30వ తేదీ వరకు హజ్ దరఖాస్తు గడువు పొడిగింపు

- మంత్రి ఎన్ఎండి ఫరూక్

విశాలాంధ్ర - నంద్యాల .. హజ్ యాత్ర కోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2025కు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువును మరోసారి పొడిగించిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం తెలిపారు. హజ్ దరఖాస్తుల ఫారమ్‌లను పూరించడానికి కేంద్ర హజ్ కమిటీ మొదట ఆగస్టు 13వ తేదీ నుంచి ప్రారంభించి, చివరి తేదీ సెప్టెంబర్ 9వ తేదీ వరకు నిర్ణయించిందని, గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించిందని తెలిపారు. అయితే దరఖాస్తు గడువును ఈ నెల 30వ తేదీ వరకు మరోసారి కేంద్ర హజ్ కమిటీ పొడిగించినట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. హజ్ యాత్ర కోసం దరఖాస్తులు అన్నీ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించడం కోసం కేంద్రహజ్ కమిటీ దేశవ్యాప్త ప్రకటన చేయడం జరిగిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లేందుకు ఇప్పటివరకు 1937 మంది ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో 1589 దరఖాస్తులు అన్ని అంశాలతో కరెక్ట్ గా ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తీసుకున్న చర్యల్లో భాగంగా ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించబోతున్నట్లు తెలిపారు. విజయవాడ గన్న వరం ఎయిర్పోర్ట్ నుంచి హజ్‌కి వెళ్లే రాష్ట్ర ప్రయాణికులకు మాత్రమే ఈ సౌలభ్యం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

సీఎంకు రూ.26,88,616 చెక్కు అందజేత



విశాలాంధ్ర-నంద్యాల .. నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు అందించిన 26,88,616 రూపాయల విలువగల చెక్కులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేయడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల కోసం నంద్యాల ప్రజలు ముందుకొచ్చి ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారని, ఆ చెక్కులను విడతల వారీగా అందిస్తున్న దాంట్లో భాగంగా మూడో విడతలో సీఎం చంద్రబాబు నాయుడుకు రూ. 26,88,616ల విలువ గల చెక్కులను ఇవ్వడం జరిగిందని తెలిపారు. వరద బాధితులను ఆదుకోవడంలో ముందుకొచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఇంకా ప్రజలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు.

క్రీడాలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర-డోన్ .. క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్రికే హరికిషన్ అన్నారు. డోన్ నియోజకవర్గస్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల క్రీడా పోటీలు కోఆర్డినేటర్ సుధాకర్,డోన్, పాతపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన మంగళవారం కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలలో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. వాలీబాల్, కబడ్డీ, తదితర పోటీలను ప్రారంభించి, ఇరుజట్లను పరిచయం చేశారు. ఈ పోటీలలో గెలుపొందిన వారిని జిల్లా స్థాయి ఆటల పోటీలలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మద్రి రమణ, శేషిరెడ్డి, అర్జున్ రెడ్డి,పంచాయతీ రాజ్ ఇఇ గంగాధర్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌లు హాజరయ్యారు.

నందికొట్కూరులో 30న మెగా జాబ్ మేళా.

విశాలాంధ్ర. నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ సుబ్బన్న మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో మాంద్ర స్వగృహం నందు నియోజవర్గ ఎమ్మెల్యే జయసూర్యను కలసి జాబ్ మేళా ఫ్లైయర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్ మేళకు ఆరు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని పదవ తరగతి, ఐటిఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొని మీ భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని తెలియజేశారు. ఇతర వివరాల కోసం ఫోన్ నం.9154830286, 6300324076 లలో నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

విశాలాంధ్ర. నందికొట్కూరు క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని దామగట్ల సర్పంచ్ మాధవరం సుశీలమ్మ అన్నారు. మంగళవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాల బాలికల మీట్ కం సెలక్షన్స్ రెండవ రోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామగట్ల నందు కొనసాగాయి. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మ షీల్డ్ దాత డాక్టర్ దాలు చంద్ర శేఖర్, పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ రషీద్ భాషా హాజరయ్యారు. ముందుగా గ్రామ సర్పంచ్ సుశీలమ్మ వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్రీడలకు నందికొట్కూర్ మండల పరిధిలోని అన్ని మేనేజ్మెంట్ల పాఠశాలల నుండి బాల బాలికల విభాగంలో 300 మంది క్రీడాకారులు రావడం సంతోషమన్నారు. వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ క్రీడలలో బాల బాలికల విభాగంలో హోరాహోరీగా జరిగాయి. అనంతరం క్రీడల్లో గెలుపొందిన జట్లకు అతిథులు షీల్డు మెడల్స్ అందజేశారు. ఇక్కడ సెలెక్ట్ కాబడిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయిలో సెప్టెంబర్ 30 అక్టోబర్ 01వ తేదీలలో నంది కొట్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే క్రీడల్లో పాల్గొంటారనీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనిత జీవన్ మండల ఎస్ జి ఎఫ్ కోఆర్డినేటర్ వీరన్న, మీట్ ఆర్గనైజర్ సుంకన్న, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనాథ్ పెరుమాళ్ళ, స్వామి దాసు రవికుమార్, రామకృష్ణ, డోరతి, పద్మలత పాల్గొన్నారు.

సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సుబ్బారెడ్డి

విశాలాంధ్ర, డోన్ రూరల్: డోన్ నియోజకవర్గ టిడిపి నేత రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ధర్మారం మన్నే సుబ్బారెడ్డిని కీలక నామినేటెడ్ పదవి వరించింది. సుబ్బారెడ్డిని సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు డోన్ నియోజకవర్గంలో టిడిపి పార్టీకి అండగా నిలిచి కార్య కర్తలకు దిశా నిర్దేశం చేయడమే కాకుండా ప్రస్తుత డోన్ ఎమ్ ఎల్ ఏ కోట్ల కొరకు చంద్ర బాబు నాయుడు ఆదేశం మేరకు ఎమ్ ఎల్ ఏ సీటును సైతం వదులుకోవడం వల్ల ప్రస్తుత టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్ర బాబు నాయుడు ప్రభుత్వం సుబ్బారెడ్డికి కీలక పదవి కట్టబెట్టింది. దీంతో మంగళవారం సుబ్బారెడ్డి వర్గీయులు పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కుపాదం

విశాలాంధ్ర-చాగలమర్రి : ఆళ్ళగడ్డ సబ్ డివిజన్ పరధిలోని గ్రామాలలో అసాంఘీక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆళ్ళగడ్డ డిఎస్పి రవికుమార్ తెలిపారు.మంగళవారం చాగలమర్రి పోలీస్ స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు.స్టేషన్ పరధిలోని కేసుల వివరాలను ఎస్ఐ రమేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్యం, నాటుసారా, మట్కా జూదం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో సిబ్బంది తో నిఘా ఉంచామన్నారు.

బైరెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలోకి భారీ చేరికలు

విశాలాంధ్ర - నంద్యాల .. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఉమ్మడి ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఇది పేదల ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో పాణ్యం మండలం మద్దూరు, గోనవరం, నేరవాడ, భూపనపాడు గ్రామాల ఎంపిటిసిలు, గ్రామ సర్పంచ్ లు వైసీపీని వీడి బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్రం నిధులతో గ్రామాలు అభివృద్ధి చేసుకుందామన్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికీ సముచిత స్థానం ఉంటుందని బైరెడ్డి భరోసా ఇచ్చారు. కెడిసిసి మాజీ డైరెక్టర్ వీరేంద్ర సింహారెడ్డి ఆధ్వర్యంలో పాణ్యం మండలం మద్దూరు గ్రామ సర్పంచ్ గోపవరం ప్రదీప్ రెడ్డి, జి.భరత్ కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధు, సాకలి శివ, నాగరాజు, నూర్ బాషా, అల్లాభకాష్, రాము, అక్బర్ బాషా, గోనవరం గ్రామ సర్పంచ్ రాజమ్మ, శేఖర్,భూపనపాడు ఎంపిటిసి సుధారాణి, మనోహర్, నెరవాడ గ్రామ సర్పంచ్ లింగాల శారదమ్మ, శివారెడ్డి, ఎం.శేషారెడ్డి, రేస్మా, సుబ్బ రాయుడు, ఫిదా ఊసేన్, రఫీ, పుష్పరాజ్, శేసిరెడ్డి, జ్యోతి స్వరూప రెడ్డి తదితరులు వైసీపీని వీడి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో టీడీపీ లో చేరారు. వీరికి టీడీపీ కండువాలు వేసి బైరెడ్డి పార్టీలోకి ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో మద్దూరు గణపం పుల్లారెడ్డి, పాణ్యం పుల్లారెడ్డి, గోరుకల్లు ఎరుకలయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకట స్వామి, నంద్యాల టీడీపీ నాయకులు నరహరి విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : రైతులు ప్రతిఒక్కరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని కోవెలకుంట్ల ఏడిఏ సుధాకర్ అన్నారు. దొర్నిపాడు మండలంలోని దొర్నిపాడు, క్రిష్టిపాడు రైతు సేవ కేంద్రాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారి సునీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున, వ్యవసాయ, అనుబంధ రంగాల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు , శాస్త్రవేతలు గ్రామాలను సందర్శిస్తారన్నారు.పంట దిగుబడులు తగ్గడానికి గల కారణాలను విశ్లేషించడం, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి , భూసారం పెంచేలా చర్యలు చేపడతారన్నారు. ఏవో సునీత మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా మాత్రమే రసాయనిక ఎరువులను వాడాలని సూచించారు. ఈ దొర్నిపాడు, క్రిష్టిపాడు గ్రామాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

-వ్యవసాయ అధికారుల సలహాలు పాటించండి: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడిఏ రామ్మోహన్ రెడ్డి అన్నారు. బాచేపల్లి, అహెూబిలం గ్రామాలలో వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మేలైన యాజమాన్య పద్ధతుల గురించి చర్చించారు. అనంతరం రైతుల పొలాలను సందర్శించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పవర్ లిఫ్టింగ్ జాతీయ పోటీలకు ఎంపికైన నంద్యాల క్రీడాకారులు

విశాలాంధ్ర - నంద్యాల ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 ,15 తేదీలలో అమలాపురంలో జరిగిన 11వ రాష్ట్ర స్థాయి జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో నంద్యాల క్రీడాకారులు విజేతలుగా నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రాజు, పల్లవి, మహేష్, లక్ష్మీ నరసింహ వివిధ వెయిట్ కేటగిరీలలో పతకాలు సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం జరిగింది. అక్టోబర్ 14 నుండి 18 వరకు గోవాలో జరిగే జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో వీరు రాష్ట్రం తరపున పాల్గొంటారు. పల్లవి 43 కేజీల కేటగిరిలో 175 కేజీలు పవర్ లిఫ్టింగ్ చేసి రజత పతకం, బెంచ్ ప్రెస్ లో 40 కేజీల బరువు ఎత్తి మరో రజత పతకం సాధించింది. 93 కేజీల కేటగిరిలో బెంచ్ ప్రెస్ లో 120 కేజీల బరువు ఎత్తి రాజు స్వర్ణ పతకం సాధించగా, లక్ష్మీ నరసింహ 59 కేజీల కేటగిరిలో బెంచ్ ప్రెస్ లో 90 కేజీల బరువు ఎత్తి రజత పతకం, మహేష్ బాబు 93 కేజీల కేటగిరీలో బెంచ్ ప్రెస్ లో 130 కేజీల బరువు ఎత్తి కాంస్య పతకం సాధించారు. కళారాధన కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఐఎంఎ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు, ఉమ్మడి కర్నూలు జిల్లా ఒలింపిక్ సంఘం మాజీ చైర్మన్ డాక్టర్ రవికృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, కళారాధన సభ్యులు రమణయ్య, బాలచంద్రుడు, బంది రామచంద్రుడు పాల్గొని క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

గుండెపోటుతో జమీయతే ఉలేమా ఏ హింద్ అధ్యక్షుడు మౌలానా ఖలీల్ మృతి

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాలకు చెందిన జమీయతే ఉలేమా ఏ హింద్ అధ్యక్షులు మౌలానా ఖలీల్ మంగళవారం ఉదయం గుండెపోటుతో ఆయన స్వగృహంలో మృతి చెందారు. మౌలానా ఖలీల్ సంఘమి ఇస్లామిక్ వక్తగా, ఇస్లాంపై జరిగే దుష్ప్రచారాలపై, దౌర్జన్యాలపై ఎల్లప్పుడూ పోరాడే ఒక నాయకుడిగా ఉలమాల శ్రేయస్సు, అభ్యున్నత కోసం పోరాడే ఒక మత పెద్దగా, నిరుపేదల వివాహాలకు, వరదలు ఇతర విపత్తుల వల్ల నష్టపోయిన వారికి కుల మతాలకతీతంగా ఆదుకోవడంలో ముందు వరుసలో ఉండేవారు. ఉలమాల అనేక సమస్యలపై పోరాడారు. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, పలువురు ముస్లిం మైనారిటిలు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం అన్యాయం

విశాలాంధ్ర, మిడుతూరు -: గత 25 ఏళ్లుగా దేవనూరు గ్రామం లోని జిల్లా పరిషత్, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద వంట చేస్తున్న కార్మికుల వంట సామగ్రిని బయట పడేయడం అర్ధాంతరంగా మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.పకీరి సాహెబ్, టి.ఓబులేసు సిఐటియు మండల నాయకులు వెంకట శివుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవనూరు గ్రామంలో పాఠశాలలో మధ్యాహ్నం భోజన కార్మికులను పోలీస్ బందోబస్తు తో బయటకు గెంటివేయడం శోచనీయమన్నారు.

విద్యార్థులు ఓటమికి నిరుత్సాహ పడరాదు

విశాలాంధ్ర బనగానపల్లె: విద్యార్థులు ఆటల పోటీలలో గెలుపు ఓటములకు నిరుత్సాహపడక విజయానికి కృషి చేయాలని బనగానపల్లె ఎంఈఓ పి. స్వరూప అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పలుకూరులో బనగానపల్లె మండల స్కూల్ గేమ్స్ అండర్ 14 బాలబాలికల ఎంపిక పోటీలో కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బనగానపల్లె మండల ఎంఈఓ 1 స్వరూప ఎం శ్రీనివాసులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరీ శంకర్ గ మండల కోఆర్డినేటర్ జి శ్రీనివాసులు, సురేంద్ర, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ మధు హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు విజయానికి చేరువలో ఉండాలని అండర్ 14 ఇయర్స్ బాలబాలికలకు తెలియజేశారు.. వ్యాయామ ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది అన్నారు.

విద్యా హక్కును కాలరాస్తున్నారు..

విశాలాంధ్ర - నంద్యాల ఉర్దూ మీడియం విద్యార్థులు తమ మాతృ భాషలో అనుమతి లేకుండా పరీక్షలు రాయకూడదనే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వివక్షపూరిత నిర్ణయాన్ని నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ తీవ్రంగా ఖండించింది. నంద్యాల ముస్లిం జేఏసి గౌరవాధ్యక్షులు ఎస్ఎండి అబులైస్, షేక్ అబ్దుల్ సమద్ స్థానిక జేఏసి కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ బీజేపి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉర్దూ భాషపై వివక్షతో సిబిఎస్ఈ తీసుకున్న నిర్ణయం ఆక్షేపనీయమని, ఇరవై కోట్ల మంది భారతీయుల మాతృ భాషపై దాడి అని, సీబియస్‌సి చర్యను ఖండించారు. ఈ నిర్ణయం భారత రాజ్యాంగంలోని 29, 30 అధికరణలను ఉల్లంఘిస్తుందని, మైనారిటీ హక్కులు, భాషా స్వేచ్ఛకు రాజ్యాంగం ఆర్టికల్ 29, 30ల ద్వారా హామీ ఇస్తుందని, ఇది ఉర్దూ మాట్లాడే విద్యార్థులను అసమానంగా ప్రభావితం చేస్తుందన్నారు. గళం విప్పాలని అన్ని రాజకీయ పార్టీలను ప్రజా సంఘాలను కోరుతున్నామని జేఏసి నాయకులు అబులైస్, సమద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంజేఏసి మీడియా ప్రతినిధి జాకీర్, మునిర్ అహ్మద్, మార్కెట్ అర్షద్, జేఐహెచ్ జకారియా, ఖిద్మత్ ఫయాజ్, యూనుస్, తవ్వేవాలె షఫీ తదితరులు పాల్గొన్నారు.

26న చేతి వృత్తిదారుల సమావేశం

విశాలాంధ్ర నంద్యాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ గురువారం నంద్యాల పట్టణం సాయిబాబా నగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించే సమావేశాన్ని జయప్రదం చేయాలని సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు సుబ్బయ్య, రామ్మోహన్ కోరారు. ఈ సమావేశానికి చేతి వృత్తి దారుల సమాఖ్య ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగ నాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పాల్గొని చేతి వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారన్నారు. బ్యాంకులలో రుణాలు ఇచ్చేందుకు అనేక కారణాలు చూపుతూ బ్యాంక్ అధికారులు పట్టించుకోవడంలేదని వీటి అన్నింటి పైన ఈ సమావేశంలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుంటామని జిల్లాలో చేతి వృత్తుదారుల సమస్యల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, సమితి సభ్యులు, ఆహ్వానితులు సకాలంలో తప్పకుండా హాజరు కావాలని కోరారు.

వరద బాధితులకు రూ.15 వేల విరాళం

విశాలాంధ్ర, డోన్ రూరల్: విజయవాడలోని వరద బాధితులకు వెంకటేశ్వర స్కూల్ ఆధ్వర్యంలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అక్బర్ పాషా, సార్క్ స్కూల్ అధినేత చంద్రశేఖర్‌లకు విద్యార్థులు 15 వేల రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి ఇతరులకు సహాయపడడం ఎంతో సంతోషించదగిన విషయమని తెలిపారు. కరస్పాండెంట్ సురేష్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అవుకు ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా రాముడు

విశాలాంధ్ర-అవుకు: అవుకు ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్‌గా ఎం రాముడు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న వసంత కర్నూలు ఆడిట్ డిఆర్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ల కొరకు వచ్చే వారికి సాధ్యమైనంత త్వరగా పని పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరమ్మ, కార్యాలయ సిబ్బంది, దస్తావేజులేఖరులు అభినందనలు తెలిపారు.

యథేచ్ఛగా తాండ్రపాడు గంగమ్మ చెరువు కబ్జా

- జగన్నాథగట్టు గావెల్ తోలి చెరువును చదును చేసిన అక్రమార్కులు
- ప్లాట్లు వేసేందుకు యత్నాలు
- గత ప్రభుత్వ హయాంలోనే రికార్డులు తారుమారు
- సీఎం గారు కబ్జాకోరుల నుండి గంగమ్మచెరువుకు విముక్తి కలిగించండి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ఏడు గ్రామాలకు తాగు,సారు నీరు అందించే తాండ్రపాడు గంగమ్మ చెరువుపై కబ్జారాయుళ్ల కన్నుపడింది. జగన్నాథగట్టును తవ్వి గ్రావెల్ తీసి చెరువును పూడ్చి దానిలో 11 ఎకరాల మేరా ఆక్రమించారు. అంతేకాక యథేచ్ఛగా చెరువు భూమిలో ప్లాట్లు వేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. వందల సంవత్సరాలుగా సర్వే నెం:77,78 79, 89,299,301,310లో సుమారు 80 ఎకరాల్లో గంగమ్మ చెరువు విస్తరించి ఉంది. అధికార బలంతో చెరువు స్థలం 83 సెంట్లు ఉన్నట్లుగా రికార్డు తారుమారు చేసినట్లు గ్రామస్తులు చెపుతున్నారు. ఈ చెరువులో నీరు ఉండటం వల్ల చుట్టు పక్కల చాలా గ్రామాల్లోని బోరుబావుల్లో నీరు తగ్గకుండా రైతులకు వ్యవసాయానికి అనువుగా ఉంటుంది. 2019 వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొంతమంది కబ్జాకోరుల కన్ను ఈ గంగమ్మ చెరువుపై పడింది. వెంటనే దీనికి అధికారపార్టీ నేతల మద్దతు కూడా తోడవడంతో జగన్నాథగట్టు నుండి పెద్దఎత్తున గ్రావెల్ తోలి చెరువును పూడ్చి వేశారు. నంద్యాల- కర్నూలు ప్రధాన రహదారిని అనుకొని ఉండటంతో సుమారు 11 ఎకరాల మేరా చెరువును పూడ్చి వేసి చుట్టూ మొక్కలు నాటారు. ఇదేమని గ్రామస్తులు ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెట్టడం, వారిపై దాడులకు ప్రయత్నం చేయడంతో వారు భయభ్రాంతులకు గురై ఎవరికి వారు మిన్నకుండిపోయారు. 2022 జులై 23వ తేది గ్రామ పంచాయతీ చెరువు పూడ్చివేతను నిలిపివేయాలని తీర్మాణం చేసినా అధికారులు ఎవరూ సహకరించకపోవడంతో పంచాయతీ సర్పంచ్, గ్రామస్తులు ఎవరూ ఏమీ చేయలేకపోయారు. దీనిపై కొందరు కోర్టుకువెళ్లినా కోర్టులో కేసును తన రాజకీయ అండతో ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. అధికారులు కూడా కోర్టుకు సరైనా ఆధారాలు అందించకుండా తప్పుదారి పట్టించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ నేతలకు భయపడి గ్రామస్తులు ఇష్టం లేకపోయినా మిన్నకుండి పోయారు. ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు చేయడం వల్ల వారు మిన్నకుండిపోయారు. కర్నూలు పట్టణానికి వచ్చిన అప్పటి ప్రతిపక్షనేత ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి గ్రామస్తులు, పార్టీ నేతలు తీసుకుపోవడంతో ఆయన ఓర్వకల్లు విమానాశ్రయంకు పోవు సమయంలో గంగమ్మ చెరువును సందర్శించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతల కబ్జాకోరు తనానికి పరాకాష్ట ఈ గంగమ్మ చెరువు కబ్జా అన్నారు. చెరువు ఆక్రమణ దుర్మార్గమని, ప్రభుత్వం వెంటనే దీనికి తొలగించాలన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గంగమ్మ చెరువును కబ్జాకోరుల నుండి విముక్తి కలిగిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతుందని, గ్రామస్తులకు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబునాయుడు నిలుపు కోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కబ్జాకోరుల నుండి గంగమ్మ చెరువుకు విముక్తి కలిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోరాటాలకు సిద్ధం కండి

సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు : పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను అదుపుచేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని, ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. మంగళవారం సీపీఐ కర్నూలు రూరల్ మండలం కమిటీ సమావేశం సీఆర్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ బి.గిడ్డయ్య,రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కే.జగన్నాథం పూర్వపు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కే.రామాంజనేయులు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప,నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి బి.గిడ్డయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చినటువంటి అన్ని హామీలను అమలు చేయాలని అమలు చేసే దానికోసం సీపీఐ పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీకి ప్రత్యేక హెూదా ఇచ్చే దానికోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, పోలవరం ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేసి నిర్వాసితులకు నష్టపరిహారాన్ని ఇవ్వాలని, వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు ఇవ్వాలని, కడప స్టీల్ పరిశ్రమము ఏర్పాటు చేసి ప్రభుత్వ నిర్వహించాలన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు అయిన వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టుల పనుల ను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ సమావేశంలో సీపీఐ నాయకులు చంద్రశేఖర్, మహేష్, డిశ్రీనివాసరావు, నాగరాజుల, అన్వర్,మాణిక్యం పాల్గొన్నారు.

కర్నూలు రూరల్ మండల కమిటీ ఎన్నిక... సీపీఐ మండల కార్యదర్శిగా సురేంద్ర యాదవ్ ,కమిటీ మెంబర్స్‌గా కృష్ణా నాయక్, నాగరాజు, వెంకటేష్, మరి కొంతమందిని కమిటీ మెంబర్స్ గా ఎన్నుకున్నారు.

అక్టోబర్ 1 తేదీన జరిగే రాష్ట్రవ్యాప్త దీక్షలను జయప్రదం చేయండి

వామపక్ష విద్యార్థి యువజన సంఘాలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : విశాఖ ఉక్కు కోసం 34 మంది విద్యార్థుల , యువకుల ప్రాణ త్యాగంతో సాధించుకున్న ఈ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో అక్టోబర్ 1 తేదీన జరిగే నిరసన దీక్షలు జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి యువజన సంఘ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిఆర్ భవన్‌ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాషీర్ బాషా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసులు నగర కార్యదర్శి బిసన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్, పీడీఎస్ యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అఖండ, మహేంద్ర, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి ఆదిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల బాటలో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను బిజెపి ప్రభుత్వం తన అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టడం కోసం ప్రైవేట్ పరం చేస్తుందని దీన్ని రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అడ్డుకోకపోవడం దుర్మార్గమన్నారు .చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షణ కోసం పాటుపడతామని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానీవ్వమని చెప్పి తీరా అధికారం చేపట్టిన తర్వాత ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామి అయి ఉండి కూడా విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ గురించి మాట్లాడలేకపోవడం సిగ్గుచేటన్నారు . వేలాదిమందికి అన్నం పెట్టే విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎందుకు అడగలేకపోతున్నారని ప్రశ్నించారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటారా లేక అంబానీ, ఆదానిల పక్షాన ఉంటారో తెలుసుకోవా లన్నారు .ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధమేనని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు .ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ కర్నూలులో కూడా దీక్ష జరుగుతుందని ఈ దీక్షలో విద్యార్థులు యువకులు స్వచ్ఛందంగా పాల్గొని తమ మద్దతు తెలియజేయడంతో పాటు ఎన్డీఏ ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా ఉద్యమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు అశోకు అభి, ఏఐవైఎఫ్ నగరనాయకులు చంటి, కాసిం, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రమణ, మునిస్వామి ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబు ధ్యేయం

విశాలాంధ్ర, హెూళగుంద : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బి వీరభద్ర గౌడ కొనియాడారు. హెూళగుందలో మంగళవారం సిద్దేశ్వర స్వామి రైస్‌మిల్ ఆవరణలో సర్పంచ్ చలువాది రంగమ్మ అధ్యక్షతన జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వీరభద్ర గౌడ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేశారని అలాగే వృద్ధులకు వికలాంగులకు నెలకు 4000, 6000 ప్రకారంగా పింఛన్లు పంపిణీ చేసి ఆదుకున్నారని అన్నారు అమరావతి నిర్మాణానికి 15 వేల కోట్లు కేంద్రంతో నిధులు సాధించుకున్నారని పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి 1250 కోట్లు, ఆరోగ్యశ్రీ బకాయి 700 కోట్లు కౌలు రైతులకు 400 కోట్లు గృహ నిర్మాణానికి 50 కోట్లు నిధులు విడుదల చేశారని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో సీసీ రోడ్ల నిర్మాణానికి 4 500 కోట్లు నిధులు విడుదల చేసి పల్లె అభివృద్ధికి పాటు పడ్డారని అన్నారు. బీసీ బిఐ కంపెనీకి 70 వేల కోట్లు మంజూరు చేశారని తెలిపారు.

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కూటమి ప్రభుత్వం...

:- జీడిపి నుండి రూ. 262 కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు

:- సంవత్సరంలోపు ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు

:- ఆర్డిఎస్ కుడి కాలువతో ప్రతి ఎకరాకు సాగునీరు

:- ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి

విశాలాంధ్ర నందవరం.. వంద రోజుల్లోనే అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా కూటమి ప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం నందవరంలో ఇది మంచి ప్రభుత్వం-ప్రజావేదిక, ముగతిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైకాపా వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేసిందని, ఎపి భవిష్యత్తును సీఎం చంద్రబాబు వంద రోజుల్లోనే అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలకు మాత్రం ఆపలేదన్నారు. నందవరం మండలాన్ని అభివృద్ధి చేసింది నా తండ్రి బివి మోహన్ రెడ్డి అని, ఆయన తర్వాత మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. గాజులదిన్నె ప్రాజెక్ట్ నుండి రూ. 262 కోట్లతో వాటర్ గ్రిడ్డు ద్వారా జల జీవన్ మిషన్ లో భాగంగా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని ఇస్తామన్నారు. అలాగే గ్రామంలో ప్రస్తుతానికి రూ.40 లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామని, మరో రూ.60 లక్షలతో మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామన్నారు. దసరా తర్వాత నా తండ్రి బివి మోహన్‌రెడ్డి పులిచింత రోడ్డు సైడ్ ఇచ్చిన ప్లాట్లను బీవీ కాలనీగా ఏర్పాటు చేసి పట్టాలతో సహా స్థలాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. మండలంలో నేను తెచ్చిన ఆర్‌ఓ ప్లాంట్‌లను కూడా గత ప్రభుత్వం నిరుపయోగంగా పెట్టిందన్నారు. అలాగే ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం పూర్తయితే పశ్చిమ ప్రాంతంలో ప్రతి ఎకరాలు సాగునీరు అందుతుందని, దీంతో ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాధవరావు దేశాయ్, పుష్పావతి, వెంకటరామి రెడ్డి, బండే గురు స్వామి, గురురాజ్ దేశాయ్, ఖాసీం వలి, గోపాల్, రైస్ మిల్ నారాయణ రెడ్డి, భార్గవ్ యాదవ్, రామకృష్ణ రెడ్డి, దావీదు, విరారెడ్డి, ఉరుకుంద పాల్గొన్నారు.

గుండె వ్యాధుల పట్ల అవగాహన పోస్టర్ విడుదల

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : గుండె వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందాలని కలెక్టర్ పి.రంజిత్ బాష పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ దినోత్సవం అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్న సందర్భంగా పోస్టర్ విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకర మైన ఆహారం, శరీరానికి అనువైన వ్యాయామం, దుర వాట్లకు దూరంగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రస్తుత కాలంలో గుండె జబ్బులు పెరుగుతున్న నేపథ్యంలో గుండె ఆరోగ్యం పట్ల అవగాహన చాలా అవసరం అని అభిప్రాయ పడ్డారు.. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదిన కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిపుణులైన డాక్టర్లు గుండె వ్యాధులు రావడానికి కారణాలు, రాకుండా ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలి తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. హార్ట్ ఫౌండేషన్ సెక్రటరీ డా.చంద్రశేఖర్ మాట్లాడుతూ కర్నూలులో హార్ట్ ఫౌండేషన్ 2002లో మొదలు పెట్టడం జరిగిందని, అప్పటి నుండి క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరము సెప్టెంబరు 29వ తేదిన ప్రపంచ హృదయ దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నామన్నారు. అత్యుత్తమ సేవలు అందించిన డా.డి.రాజశేఖర్, ప్రొఫెసర్ ఆఫ్ కార్డియాలజీ, శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, తిరుపతి వారికి ఈ సంవత్సరం ఔట్ స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును కర్నూలు హార్ట్ ఫౌండేషన్ తరపున అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హార్ట్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్‌లు కల్కూర చంద్రశేఖర్, డా.భవాని ప్రసాద్, ట్రెజరర్ రాముడు, సభ్యులు శర్మ, లక్ష్మణ్, వాసుదేవ మూర్తి, ప్రహ్లాద్, జగన్నాథ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి తిరుమల లడ్డు పేరుతో డ్రామాలు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: సూపర్ సిక్స్ పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చు కోవడానికే తిరుమల లడ్డు పేరుతో డ్రామాలుచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎస్వి కాంప్లెక్స్‌లోని వైసీపీ కార్యాలయంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, కోడుమూరు నియోజకవర్గ ఇన్చార్జి ఆదిమూలపు సతీష్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అబద్ధపు హామీలు, దౌర్జన్యాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు కష్టాన్ని అల్లకల్లోల పరిస్థితిలో వదిలేసారని ఎస్వీ మోహన్‌రెడ్డి మండిపడ్డారు. తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డు అంటే ప్రతిఒక్కరికి చాలా సెంటిమెంట్ అని, అంతటి ప్రాచుర్యం ఉన్న లడ్డుపై రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా హెూదాలో ఉన్న ఒక వ్యక్తి చేసిన వాక్యాలు అత్యంత దుర్మార్గమన్నారు. కోట్లాదిమంది హిందువుల మనోభావాలు దెబ్బతిశారని, చంద్రబాబు ఏ విషయంలోనైనా రాజకీయ లబ్ధి మాత్రమే ఆశిస్తారని విమర్శించారు. తల్లికి వందనం ఉచితంగా మూడు సిలిండర్ల పంపిణీ రైతు భరోసా నిరుద్యోగ భృతి 3000 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళ కు నెలకు 1500లు మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం ఇలా అన్ని హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టినందుకు మంచి ప్రభుత్వం అయిందా అంటూ ఎద్దేవా చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బ తీయకుండా సూపర్ సిక్స్ పథకాల అమలుపై దృష్టి సారించాలని హితవు చెప్పారు.

నగరపాలక ఇంజనీరింగ్ అధికారుల బదిలీ

విశాలాంధ్ర- కర్నూలు సిటీ: సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు నగరపాలక సంస్థ లో పలువురు డీఈఈలు, ఎంఏఈలకు స్థాన చలనం లభించింది. డీఈఈ కె.రవిప్రకాష్ నాయుడు రాయదుర్గం మున్సిపాలిటీకి బదిలీ కాగా ఆయన స్థానంలో ఎమ్మిగనూరు మున్సిపాలిటీ డిఈఈ జి మనోహర్ రెడ్డి,డీఈఈ ఆర్ రాజశేఖర్ ఆదోని మున్సిపాలిటీకి బదిలీ కాగా ఆయన స్థానంలో నంద్యాల మున్సిపాలిటీ డిఈఈ జి. శ్రీనివాసరెడ్డి, డిఈఈ బి.గోపాలకృష్ణమూర్తి ఏపీఎంఐడిసి మంగళగిరి బదిలీ కాగా(డిప్టేషన్) ఆయన స్థానంలో నంద్యాల డిపిహెచ్ఈఓ డిఈఈ జి గంగాధర్, కర్నూల్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ డిఈఈ ఎం. నాసిర్ నందికొట్కూరు మున్సిపాలిటీకి బదిలీ కాగా ఆయన స్థానంలో నయూబ రసూల్‌లు, ఎంఏఈలు దినేష్‌కుమార్ నందికొట్కూరు మున్సి పాలిటీకి బదిలీ కాగా ఆయన స్థానంలో పనిచేస్తున్న ఏఈ ఎన్. రూపేష్ కర్నూల్ నగరపాలక సంస్థకు, ఎంఏఈ కే.జనార్ధన్ ఆదోని మునిసి పాలిటీకి బదిలీ కాగా ఆయన స్థానంలో గూడూరు మున్సిపాలిటీ ఏఈ సివిఆర్ వైష్ణవి నియమితులయ్యారు.

పర్యాటక ప్రాంతాలకు రూ.3.33 కోట్లతో రోడ్లు మంజూరు

కలెక్టర్ పి.రంజిత్ బాష

విశాలాంధ్ర. బ్యూరో కర్నూలు : పర్యాటక అభివృద్ధిలో భాగంగా జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి లో భాగంగా రూ.3.33 కోట్లతో అప్రోచ్ రోడ్లు, సీసీ రోడ్లు మంజూరు చేశామని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని అన్ని పర్యాటక ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన డిస్ప్లే బోర్డును ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మతపరమైన పర్యాటక ప్రాంతాలు, ఎకో టూరిజం స్పాట్స్, హెరిటేజ్ టూరిజం ప్రాంతాల్లో వివరాలు ప్రజలకు సమగ్రంగా తెలిసేలా ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.. తొలుత కలెక్టరేట్లో ఈ బోర్డును ప్రదర్శిస్తున్నామని తెలిపారు. గార్గేయపురం, జగన్నాథ గట్టు, కేతవరం గుహలు, ఉరుకుంద, అశోకా శిలా శాసనాలు, సుంకేసుల,రూపాల సంగమేశ్వర స్వామి, హరిత రాక్ గార్డెన్ ప్రాంతాల్లో రోడ్లను మంజూరు చేయడం జరిగిందని వివరించారు.

సామాజిక స్పృహను పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర, ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహను పెంపొందించుకోవాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ అన్నారు. మంగళవారం స్థానిక యూనివర్సిటీలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ఆధ్వర్యంలో ఎన్.ఎస్.ఎస్. డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు "సింగల్ యూజ్ ప్లాస్టిక్" సింగల్ యూస్ ప్లాస్టిక్- ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్)ను యూనివర్సిటీ ప్రాంగణం, పరిసర ప్రాంతం నుండి సేకరించారు. రిజిస్ట్రార్ వి.లోకనాథ మాట్లాడుతూ విద్యను ఆర్జించే వయసులోనే యువతీ యువకులలో సేవాభావం, దేశభక్తి, సామాజిక స్పృహను కలిగించేందుకు 'జాతీయ సేవా పథకం' (ఎన్ఎస్ఎస్) ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి వాలంటీర్ తన విధిగా సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబూబ్ బాషా, ఎన్.ఎస్.ఎస్. అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం..

ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

విశాలాంధ్ర-పత్తికొండ : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పేర్కొన్నారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పత్తికొండ శివారులోని పంట పొలాలను పరిశీలించి వ్యవసాయ కూలీలతో మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలు అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే విధంగా క్షేత్రస్థాయిలో రైతుల దగ్గరకు వెళ్లి తగు సూచనలు సలహాలు చేయాలన్నారు. రైతులకు కావలసిన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు రైతు సేవా కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మోహన్ విజయ్‌కుమార్, వెంకటరాముడు, తెలుగుదేశం పార్టీ నాయకులు సాంబశివారెడ్డి, మనోహర్ చౌదరి, లక్ష్మీనారాయణ, లోకనాథ్, రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు. మూడు నెలలలోనే పత్తికొండ నియోజకవర్గంలోని ప్రతి మండలానికి రెండు కోట్ల నిధులను మంజూరు చేసిన ఘనత ఎమ్మెల్యే శ్యాంబాబుకు దక్కుతుందన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతున్నదని ముందు చూపు ఉన్న నాయకున్ని ఎన్నుకోవడం వలన వరద సమస్యలను వేగంగా పరిష్కరించామని తెలియజేశారు. హంద్రీ నీవా జలాల ద్వారా 68 చెరువులకు నీటినందించి, పత్తికొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని తెలియజేశారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు దృష్టికి నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టుల సమస్యలను తెలియజేశామని, త్వరితగతిన పాత ప్రాజెక్టులను పూర్తి చేసి కొత్త వాటికి శ్రీకారం చుడతామని తెలియజేశారు. పత్తికొండ నియోజకవర్గంలో త్వరలో జాబ్ మేళాను నిర్వహించి, నారా లోకేష్ ఇచ్చిన యువగలం హామీలను నెరవేరుస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి,ఎంపీడీఓ సావిత్రి,తహశీల్దార్ నాగరాజు తో పాటు మండల అధికారులు మండల టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యం

విశాలాంధ్ర తుగ్గలి: రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పాలన అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు అన్నారు. తుగ్గలి ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నాయకత్వంలో పత్తికొండ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం... ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పత్తికొండ: క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే కేఈ. శ్యాం బాబు అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో పత్తికొండకు గుర్తింపు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్రామయ్య, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, మనోహర్ చౌదరి, లోకనాథ్, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈ టీలు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మధ్యాహ్నం భోజనం తనిఖీ

- ఎంఈఓతో ఏఐఎస్ఎఫ్ నాయకుల వాగ్వాదం

విశాలాంధ్ర-పత్తికొండ: పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని మండల విద్యాధికారి తూతూ మంత్రంగా తనిఖీ చేశారని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు వినోద్ విమర్శించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా అందించడం వల్ల అర్ధాకలితో విద్యార్థులు కడుపులు మాడ్చుకుంటున్నారని, మంగళవారం మధ్యాహ్నం భోజనం మెనులో భాగంగా ఒక్కో విద్యార్థికి 85 గ్రాముల చికెన్ ఇవ్వాల్సి ఉండగా, అక్కడే ఉన్న ఎంఈఓ ప్రశ్నించా ల్సింది పోయి చూసి చూడనట్లు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని, లేని యెడల విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రవి కిరణ్, శ్రీ చరణ్, రవికుమార్, చంద్ర, కేశవ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంను సశ్యశ్యామలం చేస్తా - ఎంపీ నాగరాజు



విశాలాంధ్ర, మంత్రాలయం : మంత్రాలయంను సశ్య శ్యామలం చేస్తామని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం మంత్రాలయం మండలం చిలకలడోన గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించారు. మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ ఎన్‌రాఘవేంద్రరెడ్డి ముందుగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలవేశారు . ప్రతి ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో చేసిన మంచి పనులు ప్రజలకు తెలియచేశారు. ఎంపీ మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన నియోజకవర్గంగా మంత్రాలయం ఉందని దానిని అభివృద్ధిలోను అక్షరాస్యతలోనూ ముందుకు నడిపించడమే నా లక్ష్యం అన్నారు. బిజెపి ఇంచార్జ్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, జనసేన ఇంచార్జ్ లక్ష్మన్న స్పెషల్ అధికారి నారాయణ మూర్తి, ఎంపీడీఓ మణి మంజరి, సీఐ రామాంజులు మంత్రాలయం మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, చావిడి వెంకటేష్, హాజరయ్యారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



విశాలాంధ్ర : కోడుమూరు : జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తానని తీర్మానం చేసి కేంద్రానికి పంపినందుకు, జూనియర్ లాయర్లకు స్టైఫండ్ నెలకు రూ.10 వేలు ఇస్తానని ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ చంద్రబాబు నాయుడు చిత్రపటానికి లాయర్ల అసోసియేషన్ తరపున పాలాభిషేకం నిర్వహించారు. స్థానిక కోట్ల సర్కిల్లో నిర్వహించిన కార్యక్రమానికి టిడిపి 232 బూతు కన్వీనర్ రాముడు అధ్యక్షత వహించారు. సీనియర్ లాయర్ ఎర్రదొడ్డి శ్రీనివాసులు,బార్ అసోసియే షన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ గిత్త రమేష్‌లు పాల్గొన్నారు.

క్రిష్ణగిరి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ ..

విశాలాంధ్ర క్రిష్ణగిరి క్రిష్ణగిరి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ బిందు మాధవ్ మంగళవారం సాయంకాలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రౌడీషీటర్ల కేసులు, సస్పెక్ట్ సీట్,పెండింగ్ కేసులు, ఫ్యాక్షన్ గ్రామాలు, నేర చరిత్ర కలిగిన వారి వివరాలు తదితర వాటిపై ఎస్సై మల్లికార్జునను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యే నిఘా ఉంచడమే కాకుండా పోలీసులు గ్రామాలను సందర్శించాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి గ్రామాలలో ప్రజలతో మమేకమై సంబంధాలు కలిగి ఉంటే గ్రామాల్లో ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే సమాచారం తెలుస్తుందన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట వెల్దుర్తి సీఐ మధుసూదన్‌రావు, కర్నూలు సీఐ ప్రసాద్ ఉన్నారు.

పోలీస్ పికెట్ తనకి..

విశాలాంధ్ర-వెల్దుర్తి: చెరుకులపాడు గ్రామాన్ని మంగళవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో పోలీస్ పికెట్‌లో ఉన్న వారందరికీ అప్రమత్తంగా ఉండాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో సీఐ మధుసూదన్ రావు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు ప్రజలు సహకరించాలి..

నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు విజ్ఞప్తి

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : నగరంలో అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా జరుగుతున్న పారిశుద్ధ్య పనులకు ప్రజలు సహకరించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు కోరారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో మంగళవారం ఆర్.యస్. రోడ్, బంగారు పేట, మౌర్య ఇన్ కూడలి, రివర్వ్యూ కాలనీ, ఆనంద్ థియేటర్ వద్ద హంద్రీ నది పైవంతెన, పాత డంపింగ్ యార్డ్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. మురుగు కాల్వలపై నిర్మాణాలు ఉండటంతో వాటిని తొలగించాలని కాల్వల్లో ప్రవాహానికి ఆటంకాలు కలగకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, బుధవారం 25, సెప్టెంబరు 2024

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

టిడిపి కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు కేఈ మల్లికార్జున గౌడ్

విశాలాంధ్ర : కోడుమూరు

పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కేఈ మల్లికార్జున గౌడ్ అన్నారు. మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కోడుమూరు గ్రామ పంచా యితి కార్యాలయంలో ఉప సర్పంచు మాధులు అధ్యక్షతన, ప్రత్యేక అధికారి ఎంపీడీఓ చంద్రశేఖర రావు,గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో "ఇది మంచి ప్రభుత్వం" ప్రజా వేదిక- గ్రామ సభ నిర్వహించారు. ఈ ప్రజా వేదిక టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కేఈ మల్లికార్జున గౌడ్‌తో పాటు అధికారులు,ప్రజా ప్రతినిధులు 100 రోజులలో ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పాలన గురించి ప్రశంసా పూర్వకంగా మాట్లాడారు. ఎంపీడీవో చంద్రశేఖర్ స్వర్ణాంధ్ర ఏ 2047 ప్రజల దార్శనికత గురించి వివరించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు స్టిక్కర్లను ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించి, చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రవీంద్ర గౌడ్, గోపాల్ నాయుడు,గంగాధర్ నాయుడు, చేనేత భాస్కర్, బ్రిటిష్ రాముడు,వార్డు మెంబర్ రామచంద్రుడు, ఇంతియాజ్ భాష, రాము,మధు,ధర్మ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు

విశాలాంధ్ర- చిప్పగిరి: పత్తికొండ డివిజన్ ఆలూరు నియోజకవర్గం పరిధిలోని చిప్పగిరి మండలమునకు బదిలీ అయిన రెవెన్యూ అధికారులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చిప్పగిరి ఇంచార్జ్ తాసిల్దార్ ఇజాజ్ అహ్మద్ మాత్రికేయులతో మాట్లాడుతూ చిప్పగిరి రెవిన్యూ జూనియర్ అసిస్టెంట్ నాగరాజు కొన్ని మాసాల క్రితం పదవి విరమణ పొందడంతో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టు ను డివిజన్ కేంద్రమైన పత్తికొండ ఆర్డిఓ కార్యాలయము నందు విధులు నిర్వర్తిస్తున్న వీరేష్ ను చిప్పగిరి రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ గా బదిలీ చేయడంతో మంగళవారం చిప్పగిరి తాసిల్దార్ కార్యాలయము నందు వీరేష్ రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు

జీతాల కోసం సమగ్ర శిక్షణ ఉద్యోగుల ఆందోళన

విశాలాంధ్ర, జిల్లా పరిషత్ కర్నూల్ .. కర్నూలు జిల్లాలోని సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 600 పైగా ఉద్యోగస్తులకు రెండు నెలలు కావస్తున్న (ఆగస్టు) వేతనం ప్రభు త్వం నుంచి అందలేదు. దీంతో మంగళవారం జిల్లాలోని అన్ని మండల వనరుల కేంద్రాల్లో ప్లేకార్డ్స్ పట్టుకొని భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. వెంటనే జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. కర్నూలు జిల్లా సమగ్ర శిక్ష జేఏసీ కమిటీ. రాష్ట్ర సమగ్ర శిక్ష జేఏసీ సెక్రెటరీ ఎం.చంద్రశేఖర్ రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-గోనెగండ్ల : గోనెగండ్ల మండ పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన సీతారాముడు(32) చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. సీఐ గంగాధర్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు నందవరం మండలం, కనకవీడు పేటకు చెందిన సీతారాముడు, పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన మునీంద్రమ్మ తో ఆరు సంవత్సరాలు క్రితం వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీతారాముడు ఇంటి నిర్మాణం కోసం దాదాపు 8లక్షలు అప్పు కాగా, మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబించాలి

విశాలాంధ్ర, సిబెళగల్ : రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచారంపై అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళ వారం సిబెళగల్ మండలం చింతమాను పల్లి గ్రామం లో వ్యవసాయ అనుబంధ రంగాలను లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తోంది రా అనే కార్యక్ర మాన్ని ప్రారంభించారు. పంటలపై ఉన్న చీడపీడలను గుర్తించి వీటికి తగిన సస్యరక్షణ చర్యలను పాటించి అధిక దిగుబడి పొందేలా వ్యవసాయ అధికారి జి.మల్లేష్‌కుమార్ అధ్యక్షతన సూచనలు చేశారు. సి బెలగల్ చింతమానుపల్లె గ్రామాలలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు కావలసిన వ్యవసాయ యాంత్రికరణ పనిముట్ల గురించి వివరించారు. ఖరీఫ్ సీజన్లో ఈ పంట నమోద ఈకే వైసీని పూర్తి చేసుకోవాలన్నారు. గోకులం మినీ షెడ్లు కావాలని ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకుని తమను సంప్రదించాలని అన్నారు. బెలగల్ సర్పంచ్ పాండురంగన్న మాట్లా డుతూ రైతులు వ్యవసాయ అధికారుల సూచ నలు సలహాలు పాటించి నాణ్యమైన లాభసాటి వ్యవసా యాన్ని చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ పశువైద్యాధికారి ప్రవీణ్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో మెళకువలు పాటించాలి

విశాలాంధ్ర- చిప్పగిరి: రైతులు పంటల సాగులో మెళకువలు పాటించాలని అప్పుడే సాగు చేసిన పంటలు అధిక దిగుబడి వస్తుందని మండల వ్యవసాయ అధికారిని జయలక్ష్మి తెలిపారు. రైతుల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం రామదుర్గం, గుమ్మనూరు గ్రామాలలో నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్షలు ప్రతి ఒక్క రైతు చేయించుకోవాలని దానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు.

పొలం పిలుస్తోంది సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ అన్నారు. మంగళవారం పెద్దకడబూరు రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టి.డి.పి రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి యన్.రమాకాంత్ రెడ్డి, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత కే. మౌనిక హాజరయ్యారు. ఉద్యాన శాస్త్రవేత్త మౌనిక మాట్లా డుతూ మిరపలో తామర పురుగు నివారణ చర్యలను క్షుణ్ణంగా వివరించారు.

వాగులను కబ్జా నుండి కాపాడండి

విశాలాంధ్ర బనగానపల్లె : మండలంలోని దద్దనాల ప్రాజెక్టు నుండి జుర్రెలు వాగు వెంట కోయిలకుంట్ల వరకు కబ్జా గురైన కట్టడాలను, తొలగించాలని గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షుడు కాలింగ రాముడు పేర్కొన్నారు. ఇప్పుడు బనగానపల్లె పట్టణములో చాలావరకు జుర్రెరు వాగు కబ్జాఅయినది. వర్షాకాలంలో వర్షపు నీరు ఎక్కువ వస్తే బనగానపల్లె మునిగిపోయే ప్రమాదం పొంచి ఉందని మొన్నటి వరకు విజయవాడ గుంటూరులో నీ పరిస్థితి బనగానపల్లెలో కూడా కొన్ని కాలనీలు మునిగే అవకాశాలు ఉన్నాయని, ఇప్పటికైనా కబ్జా చేసిన వారు ఎంతటి వారైనా సరే వాగు వంకల స్థలంలో నిర్మాణాలను తొలగించాలని అధికారులను కోరారు.

సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

విశాలాంధ్ర, మిడుతూరు - సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు రైతులు సాధించవచ్చని నంద్యాల ప్రిన్సిపల్ శాస్త్రవేత్త ఏ .రామకృష్ణారావు మండల వ్యవసాయ అధికారి ఎం. పీరు నాయక్ అన్నారు. మంగళవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో మండల పరిధిలోని 'అలగనూరు' మరియు ' రోళ్లపాడు ' గ్రామంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శనగ పంటలు లద్దె పురుగులు నివారణ కోసం సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి సూచనలు తెలిపారు. విత్తినప్పటి నుండి 25 రోజుల వరకు, గుడ్ల సముదాయాన్ని ఏరి నాశనం చేయాలి. ఎకరానికి వేప నూనె 10000 పీ.పి.యం.: 200 మి.లీ./200 లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.లింగాకర్షణ బుట్టలు ఎకరాకు 10 (పది) చొప్పున పెట్టుకోవాలివిత్తిన 40 రోజు నుండి 60 రోజుల లోపు ఈ దశలో ఎకరాకు స్పైనోసాడ్ - 70 మి.లీ/ఏకరానికి రైనాక్సిపైర్ - 80 మి.లీ/ఏకరానికిస్పైనోటరామ్ 100 మి.లీ./ఏకరానికి,ఎమామెక్టిన్ బెంజోయేట్ - 80 గ్రా.ఏకరానికిథయేమిథాక్సామ్ ం లామ్డా సైహలోత్రిన్ ఏ 100 మి.లీ./ఏకరానికి పిచికారి చేసు కోవాలని రైతులకు తెలియజేశారు.

మున్సిపల్ కమిషనర్ కలిసిన టిడిపి నాయకులు.

విశాలాంధ్ర. నందికొట్కూరు .. నందికొట్కూరు పురపాలక సంఘం కమిషనర్ ఎస్ బేబీని ఎబిఎం పాలెం టిడిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏబీఎం పాలెంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, నిమ్మకాయల మోహన్, 22వ వార్డు ఇన్చార్జి కళాఖర్,రాజు, రాజ్ కుమార్, సన్నీ, ప్రమోద్, బొగ్గుల శేఖర్,అడివప్ప, ఏబీఎం పాలెం టీడీపీ యువ నాయకులు, ప్రేమ్, కళ్యాణ్,చిన్న వంశీ, లాలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రాసిన లెటర్‌ను వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర. నందికొట్కూరు .. ఎన్ ఎం సి నేషనల్ మెడికల్ కౌన్సిల్ కి ముఖ్యమంత్రి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా నాయకులు ఆది డిమాండ్ చేశారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలోని జూనియర్ కాలేజీలో పిడిఎస్‌యు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేషనల్ మెడికల్ కౌన్సిల్ కి రాసిన లేఖను విరమించుకోవాలని ,రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా 5 మెడికల్ కాలేజీలు ఈ విద్యాసంవత్సరం ప్రారంభం కావాల్సి ఉందన్నారు. కానీ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లు లేరని కొరతతో 750 మంది విద్యార్థులకు అడ్మిషన్లు లేవని ప్రభుత్వం చెబుతూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను మెడికల్ విద్య నుంచి దూరం చేసేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ఆలోచిస్తుందని మండిపడ్డారు. తక్షణమే సెకండ్ ఫేజ్‌లో ఐదు మెడికల్ కాలేజీలకు అడ్మిషన్లు కేటాయించాలని లేని పక్షంలో విద్యార్థులు, విద్యార్థి నాయకులు, నిరుద్యోగుల ఆగ్రహానికి గురి కావద్దనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, ఆది, శివశంకర్ ప్రణీత్ కుమార్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిని ఉమామహేశ్వరమ్మ అన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సుద్దమల్ల గ్రామంలో రైతులు సాగుచేసిన వరి, కంది పంటలను ఆమె పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు సేంద్రియ ఎరువులు, జీవ ఉత్పత్తి సాధన కషాయాలు అందుబాటులో ఉంచుకొని ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు. రసాయనక ఎరువులు, క్రిమిసంహారక మందులు ద్వారా భూమి సారవంతం కోల్పోవడంతో పాటు రైతులు ఆర్థికంగా నష్టపోతారన్నారు.ఏఈఓ రాణెమ్మ, వ్యవసాయ సహాయకులు సాయి పాల్గొన్నారు.

మానవ వనరుల వినియోగంతోనే దేశ పురోగతి

విశాలాంధ్ర కర్నూల్ ఎడ్యుకేషన్ : దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యేనాటికి భారతేదశాన్ని సమున్నతస్థితిలో నిలపాలన్నది వికసిత్ భారత్ లక్ష్యమని రాయలసీమ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాలులో వికసిత్ భారత్ కార్యక్రమంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ప్రసంగించారు. సమర్థమైన మానవ వనరుల వినియోగం తోటే దేశం పురోగమిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభాలో అధిక శాతంగా ఉన్న యువత వికసిత భారత లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రధానపాత్ర పోషిస్తుందని కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా హాజరైన జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ప్రభాకర్ ఆశాభావం వ్యక్తంచేశారు

సస్యరక్షణతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర-చాగలమర్రి : రైతులు ఎప్పటికప్పుడు పంటలలో సస్యరక్షణ చర్యలు చేబడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజీ తెలియజేసారు.మండలం లోని శెట్టివీడు గ్రామంలో సర్పంచ్ లక్ష్మిదేవి అధ్యకతన వ్యవసాయ,అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రీయ పద్దతిలో వ్యవసాయం చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సేంద్రీయ మందుల తయారిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈఓ మంజుల, వీహెచ్‌ఏలు ఉమా,ఫరూఖ్, షాహిదా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర -చాగలమర్రి .. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో మహబూబ్ దౌలా తెలిపారు. మంగళ వారం చాగలమర్రి పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రపరచి క్లోరినేషన్ చేసారు.అలాగే అధికారులు, సచివాలయాల సిబ్బంది శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ రెడ్డి,ఈఓపిఆర్‌డి తాహీర్‌హుసేన్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ రాజ్‌కుమార్లు పాల్గొన్నారు.

నేడు రుద్రవరం మండలానికి ఎమ్మెల్యే రాక

విశాలాంధ్ర రుద్రవరం : నేడు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మండల కేంద్రములో జరిగే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరవుతున్నారని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నేడు మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగే ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణంధ్ర కార్యక్రమాలకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు అన్నారు. మండల ప్రత్యేక అధికారి, అన్ని శాఖలకు చెందిన మండల అధికారులు, గ్రామస్తులు హాజరుకావాలని ఆయన అన్నారు.

సిద్ధపల్లిలో ఇది మంచి ప్రభుత్వం

విశాలాంధ్ర ఆత్మకూరు రూరల్ : శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వం పేరిట కార్యక్రమం చేపట్టింది సిద్దేపల్లి గ్రామంలో సచివాలయం సిబ్బంది, గ్రామ పంచాయతీ సెక్రెటరీ , గ్రామ తల్లారీలు మాజీ సర్పంచ్ సింగారెడ్డి గంగాధర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు,చిట్టి రెడ్డి శేనా రెడ్డి,సింగారెడ్డి రమణారెడ్డి, సింగారెడ్డి పెద్ద సంజీవరెడ్డి,చిట్యాల లింగారెడ్డి,సింగారెడ్డి. వెంకటేశ్వరరెడ్డి, సింగారెడ్డి గోవర్ధన్ రెడ్డి, గంగిరెడ్డి, బండి రామచంద్ర సుబ్బారెడి ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రభుత్వ పాలన గురించి వివరించారు మేనిఫెస్టోలో తెలిపిన విధంగా పెన్షన్ 4000 రూపాయలు మెగా డీఎస్సీ అన్నా క్యాంటీన్ ఐదు రూపాయల భోజనం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయడం గ్రామీణ అభివృద్ధి కోసం పంచాయతీ నిధులు ఇవ్వడం జరిగిందని ప్రతి ఇంటికి తిరిగి తెలిపారు.

ప్రభుత్వ ప్రగతిపై విస్తృత ప్రచారం..

విశాలాంధ్ర బనగానపల్లె: బనగానపల్లె మండలం నందవరం, నందివర్గం, చెరువుపల్లి, బనగానపల్లె పట్టణంలోని 105 బూత్ నందు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నాయకులు వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్‌ను అతికియడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పివి కుమార్ రెడ్డి, ఉమామహేశ్వరరావు, శరత్ బాబు, తాహసిల్దార్ బినారాయణ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో నాగరాజు, ఆర్డబ్ల్యూస్ ఏఈ సాయి కృష్ణ, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతికూల వాతావరణం వల్ల తెగుళ్లు

విశాలాంధ్ర, రుద్రవరం. రైతులు సాగుచేసిన వివిధ పంటలపై ప్రతికూల వాతావరణం వల్ల అధిక తెగుళ్లు వస్తున్నాయని మండల వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కోటకొండ ఎల్లా వత్తుల గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటిస్తే మేలైన దిగుబడులను సాధించవచ్చు అన్నారు. ప్రస్తుతం వాతావరణ ప్రతికూల ప్రభావం వలన పంటలపై బ్యాక్టీరియా, ఆకుమచ్చ ,అగ్గి తెగులు వస్తున్నాయని వాటి నివారణ కొరకు సుడోమోనాస్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు

వ్యవసాయ యంత్ర పరికరాలు సద్వినియోగం చేసుకోండి ..

విశాలాంధ్ర, ఆత్మకూరు టౌన్: స్ప్రింక్లర్స్, డ్రిప్, పైప్స్ సబ్సిడీ నందు ఉన్నాయని, కావలసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగల శివ రామి రెడ్డి, మండల పార్టీ ప్రసిడెంట్ వరప్రసాద్‌రెడ్డి, టౌన్ ప్రసిడెంట్ వేణుగోపాల్, వ్యవసాయ శాఖ ఏడీఏ అంజనేయ, మండల వ్యసాయాధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్ఏఆర్ ఎస్ సైంటిస్ట్ కే.అశోక్ కుమార్‌లు తెలిపారు. పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తుంది ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నటువంటి మొక్కజొన్న, మినుము, మిరప పంటలలో అవలంబించే యాజమాన్య పద్ధతులు తెలియజేశామని తెలిపారు.

గ్రామాల్లో ఎక్కడా మట్టి రోడ్లు లేకుండా చేస్తాం..

విశాలాంధ్ర, హెూళగుంద హెూలాగుందలో ని శ్రీరామ్నగర్ కాలనీలో మంగళవారం ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు భూదేవికి పూజలు చేసి ఆరతి కర్పూరంతో పూజించారు తర్వాత గడ్డపార పట్టుకుని రోడ్డును తవ్వారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ మట్టి రోడ్లు లేకుండా చూస్తామని ప్రతి గ్రామానికి సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు రెండు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని అన్నారు రోడ్డును ప్రజలు నాణ్యతతో నిర్మించుకోవాలని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పల్లె ప్రగతికి ప్రాధాన్యపిస్తున్నారని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో సిసిరోడ్, డ్రైనేజీలు, త్రాగునీరు, వైద్య, విద్యతో పాటు అనేక సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నామని అన్నారు శ్రీరామ్ నగర్‌లో ఐదు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని అన్నారు కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ వీరన్న గౌడ, టిడిపి నాయకులు జె బసవ, గవి, జంబప్ప అబ్దుల్ సుభాన్, తిమ్మారెడ్డి యాదవ్, జాకీర్, మోయిన్, పాల్గొన్నారు

వ్యవసాయ అధికారుల సలహా సూచనలు పాటించాలి : ఏడీఏ

విశాలాంధ్ర, హెూళగుంద. హెూళగుందలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి బి వీరభద్ర గౌడ ప్రారంభించారు. రైతు శిక్షణ ఏడీఏ వేదమని మాట్లాడుతూ మెగ్నీషియం లోపం వల్ల పొలాల పంటలు ఎండిపోతున్నా యి రైతులు తెగలు, పురుగుల రోగాలు సక్రమంగ గుర్తించక ఎరువుల రసాయనిక అంగడి యజమానులు ఇచ్చిన మందులను వాడి నష్టపోతున్నారని అన్నారు భూసార పరీక్షల ఫలితాల పత్రాలను రైతులకు ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ వీరభద్ర గౌడ ఏడిఏలు సునీత, వేదమని, వ్యవసాయ అధికారి ఆనంద్ లోక్ దళ్ అందించారు

ఎమ్మెల్యే విరుపాక్షిది ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి కాదు

టిడిపి ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

విశాలాంధ్ర-ఆలూరు : ఆలూరు టిడిపి ఇంచార్జి వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఏపీలోనే కాదు, దేశం వ్యాప్తంగా తిరుమల లడ్డు ఇష్యు నడుస్తుంది. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే లడ్డు ప్రసాదములో జంతువుల, చేపలు కొవ్వు కలిసిందనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. సామాన్య ప్రజలే కాదు, దేవుడిని సైతం మోసం చేసి కల్తీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాపానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ. గత ప్రభుత్వా నిర్లక్ష్యం కారణంగానే ఈ తప్పు జరిగిందని అధికార పార్టీ ఆరోపిస్తుంటే..లేదు లేదు మా హయాంలో ఎలాంటి తప్పు తిరగలేదని వైఎస్ఆర్సిపి ఆలూరు ఎమ్మెల్యే వీరపాక్షి మాట్లాడడం చాలా సిగ్గుచేటని, టిడిపి ఇన్చార్జి వీరభద్ర గౌడ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అశోక్, రాము, అంజిరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

పౌష్టికాహారం అందించాలి

విశాలాంధ్ర, ఆస్పరి : గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలని, సకాలంలో ఇమ్యునైజేషన్ జరిగేలా చూడాలని ఆస్పరి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి మద్దమ్మ అన్నారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలతో కలిసి పోషణ్? మాసోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యం కోసం తీసుకోవలసిన సమతుల్య పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకత, కిశోర బాలికలలో రక్తహీనత తదితర అంశాలపై సిడిపిఓ మద్దమ్మ మాట్లాడారు. అనంతరం అంగన్వాడి కార్యకర్తలు పిండి వంటకాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను శీలించి గర్భవతులకు బాలింతలకు పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు శివలింగమ్మ, పద్మావతి, షాహిన్, సునీత, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడ్స్‌రైలు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర తుగ్గలి : మండల పరిధిలోని రాంపల్లి గ్రామ సమీపంలో గూడ్స్ రైలు ఢీకొని రాంపల్లి గ్రామానికి చెందిన గుజ్జుల సుంకన్న (65) తండ్రి ఓబన్న మృతి చెందాడు. మృతిచెందిన గుజ్జుల సుంకన్నకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు కలరు. రైల్వే పోలీస్ అధికారులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పౌర సరఫరాల గోడౌన్ పాయింట్ తనిఖీ

విశాలాంధ్ర -ఆదోని : ఆదోని పౌర సరఫరాల గౌడాన్ పాయింటను మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ గోడాన్ లో ఉన్న రేషన్ నిల్వ, మరియు రికార్డ్స్, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం కార్డ్ లబ్ధిదారులకు పంపిణీ చేసే పక్రియలో ఏటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు శివ రాముడు, పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దారు వలిభాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎద్దుల బండ లాగుడు పోటీలు

విశాలాంధ్ర -గోనెగండ్ల: గోనెగండ్లలో చింతలముని నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవాల సందర్భంగా ట్రాక్టర్ యూనియన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు మంగళవారం ముగిశాయి.ఈ పోటీలలో న్యూ కేటగిరి భాగంలో గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గరికపాటి లక్ష్మయ్య చౌదరి, కడప జిల్లా అయోధ్యనగర్ వెంకట సాయిదినీత్ రెడ్డి లకు చెందిన ఎద్దులు ఉమ్మడి విజేతలుగా మొదటి స్థానంలో నిలిచాయి.3వ బహుమతి గొంది బజారు కలుగొట్ల కర్నూలు జిల్లా నాలుగో బహుమతి గిడ్డయ్య నాయుడు రేమట కర్నూలు జిల్లా ఐదవ బహుమతి ఎల్లాగౌడ్ పి రుద్రవరం నంద్యాల జిల్లా ఆరవ బహుమతి షేక్ మదార్ బోయలకుంట్ల నంద్యాల జిల్లా ఎద్దులు పొందాయి.ఆరుపళ్ళ విభాగంలో మొదటి బహుమతి అక్షర రెడ్డి రాయవరం నాగర్ కర్నూల్ జిల్లా రెండవ బహుమతి బిఎల్ కే బుల్స్ కోడుమూరు మూడవ బహుమతి అభిజ్ఞ లక్ష్మి పిన్నాపురం నంద్యాల జిల్లా నాలుగవ బహుమతి కలుగట్ల రమేష్ నాయుడు,జానకి రాముడు జరదొడ్డి గద్వాల జిల్లా ఐదవ బహుమతి భీమ్ రెడ్డి జరదొడ్డి నరేష్ ఉత్తనూరు,ఆరవ బహుమతి మహబూబ్ బాషా ఏ నారాయణపురం,రమేష్ నాయుడు కలగొట్ల వృషభాలు గెలుపొందాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు గాజుల కుమారస్వామి అమరేశ్వరప్ప సోదరుల ఆధ్వర్యంలో ఈదుల దేవరబండ సుభాన్,కట్టుబడి ఖలీల్ బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్సూర్, ట్రాక్టర్ యూనియన్ సంఘం సభ్యులు ఉసేన్,రహుమ్ తుల్లా, సాయిబాబా,రాంపురం రాంజాన్,రాంపురం రఫీక్, నూర్ అహ్మద్, రాజు, ఖాసిం,గొల్ల నల్లారెడ్డి,వడ్డె రాజు, సర్పంచ్ పూజారి హైమవతి భర్త అడ్వకేట్ చంద్రశేఖర్ బేతాళ బడేసా, నజీర్ సాహెబ్, తిరుపతయ్య,అక్బర్ వలి, షేక్ షావలి, డీలర్ పక్కుర్ ద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర కర్నూల్ ఎడ్యుకేషన్.. జాతీయసేవాపథక దినోత్సవం సందర్భంగా రాయలసీమ విశ్వవిద్యాలయంలోరక్తదాన శిబిరం నిర్వహించడం శుభపరిణామమని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు హర్షంవ్యక్తంచేశారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సులర్ ఆచార్య ఎన్.టి.కె. నాయక్ ఆదేశాల మేరకువర్సిటీ ఎన్.ఎస్.ఎస్. విభాగం ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకర మన్నారు. కర్నూలు తలసేమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీవారితోపాటు, కర్నూలు బ్లడ్ బ్యాంకువారి సహకారంతో విశ్వవిద్యాలయ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో ఈ రక్తదానశిబిరాన్ని నిర్వహించినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు ఎంతో అవసరమయ్యే రక్తాన్ని దానంచేయడానికి వర్సిటీ విద్యార్థులు ముందుకురావడం అభినందనీయమని వర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పి.వి.సుందరానంద్ అన్నారు. రక్తదానంపట్ల విద్యార్థుల్లో మరింత అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపడతామని వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాదరెడ్డి తెలిపారు. రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ ఇద్దరూ రక్తదానంచేసి విద్యార్థినీ విద్యార్థు లకు స్ఫూర్తిగా నిలిచారు. సెప్టెంబరు 17 నుండి అక్టోబరు 2వ తేదీవరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాల సమయంలోనే జాతీయసేవాపథక దినోత్సవాన్ని నిర్వహించు కోవడం సంతోషంగా ఉందని వర్సిటీ ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు తెలిపారు. 42మంది రక్తదానం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కర్నూలు తలసేమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జి.సురేష్ బాబు, సభ్యులు వి.రమేష్, వర్సిటీ ఎన్.ఎస్. ఎస్.ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద రెడ్డితో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.